సాక్షి ఒడిశా

గురువారం । 10 । ఏప్రిల్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5.23.143లు, బంగారం 5 గ్రాముల 300 మిల్లీగ్రాములు, వెండి 10గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



కొలువుదీరిన ఘటాలు

రాయగడ పట్టణంలో మజ్జిగౌరి అమ్మవారి చైత్రోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి ప్రతిరూపాలుగా కొలిచే ఘటాలు కొలువుదీరాయి.

- 8లో



కార్యాలయానికి తాళాలు వేసిన కౌన్సిలర్లు

- 8లో

నబరంగ్‌పూర్‌ మున్సిపల్‌ కార్యాలయానికి కౌన్సిలర్లు బుధవారం తాళాలు వేసి నిరసన తెలిపారు.

న్యూస్‌రీల్‌

డివైడర్‌ని ఢీకొన్న ట్రక్కు



నుజ్జయిన ట్రక్కు ముందరి భాగం

భువనేశ్వర్‌: స్థానిక పాలాసుణి ప్రాంతంలో బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం సంభవించింది. ఒకేసారి 3 ట్రక్కులు ఒక దాని వెంబడి మరొకటి ఢీకొన్నాయి. ఒక ట్రక్కు డివైడర్‌ను ఢీకొట్టిన తర్వాత వెనుక నుంచి మరో 2 ట్రక్కులు ఢీకొనడంతో ఈ దుర్ఘటన సంభవించింది. ఈ దుర్ఘటనలో ఒక ట్రక్కు డ్రైవర్‌ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు అతడిని చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్చారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్య వర్గాల సమాచారం.

నాటు తుపాకీతో వేటగాడు అరెస్టు



పట్టుబడిన శుక్ర మడ్కమి

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి కొయిలిపరి గ్రామానికి చెందిన శుక్ర మడ్కమి అనే వ్యక్తి రెండు నాటు తుపాకీలతో అడవి జంతువుల కోసం సంచరిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం కోరుకొండ పోలీసులు పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న సమయంలో ఈ వ్యక్తి అడవి నుంచి బయటకు వస్తూ కనిపించాడు. దీంతో వెంటనే పోలీసులు అరెస్టు చేసి కోరుకొండ ఐఐసీ హిమాంశు శంకర్‌ బారిక్‌ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ విచారించగా జంతువులను వేటాడేందుకు వెళ్లినట్లు అంగీకరించాడు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.


ఇంటి పైనుంచి జారిపడి వృద్ధుడి మృతి



మృతుడు గంగారావు

రాయగడ: ఇంటి పైనుంచి జారిపడిన ఒక వృద్ధుడు మృతి చెందాడు. జిల్లాలోని కల్యాణ సింగుపూర్‌ సమితి కొంధ్‌ కతిపాడు పంచాయతీలోని రింజాబడి గ్రామంలో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఈ ఘటనలో మృతి చెందిన వ్యక్తి గంగారావు కద్రక(50)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇంటిపై ఆరబెట్టిన బట్టలను తీస్తున్న సమయంలో కాలుజారి కిందపడిపోయాడు. దీంతో తీవ్రగాయాలకు గురైన అతడిని కల్యాణసింగుపూర్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి పేరుతో యువతికి మోసం



అరెస్టైన నిందితుడు రామ్‌దాస్‌

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి అంబిలిబేడ గ్రామానికి చెందిన రామ్‌దాస్‌ అనే యువకుడిని బలిమెల పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సదరు యువకుడు బలిమెల పోలీసుస్టేషన్‌ పరిధి రస్‌బేడ గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి, శారీరకంగా దగ్గరయ్యాడు. అయితే ఇటీవల ఇంకో యువతిని పెళ్లి చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. ఈ విషయం తెలియడంతో రాస్‌బేడ గ్రామానికి చెందిన యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో అతడిని స్వగ్రామంలో బుధవారం అరెస్టు చేసినట్లు ఐఐసీ ధీరజ్‌ పట్నాయక్‌ వెల్లడించారు.

సమాచార కమిషనర్‌గా మనోజ్‌ కుమార్‌

భువనేశ్వర్‌: విరామ ఐఏఎస్‌ అధికారి మనోజ్‌ కుమార్‌ పరిడా ప్రధాన సమాచార కమిషనర్‌గా నియమితులయ్యారు. ఆయనతో పాటు మాజీ ఐఏఎస్‌ అధికారులు ప్రాణ బిందు ఆచార్య, పవిత్ర మండల్‌, రాష్ట్ర హైకోర్టు న్యాయవాది కల్పనా పట్నాయక్‌ సమాచార కమిషనర్లుగా నియమితులయ్యారు.

ట్రాఫిక్‌ సమస్య తీరేలా..!

- నగరంలో లేన్‌ డ్రైవింగ్‌
- జయదేవ్‌ విహార్‌లో ప్రయోగాత్మకంగా అమలు





ట్రాఫిక్‌ కోన్‌లతో వరుసల విభజన

భువనేశ్వర్‌: నగరంలో ట్రాఫిక్‌ సమస్యలను పరిష్కరించేందుకు వరుస డ్రైవింగ్‌ (లేన్‌ డ్రైవింగు) విధానం ప్రయోగాత్మకంగా బుధవారం ప్రవేశపెట్టారు. తొలుత స్థానిక జయదేవ్‌ విహార్‌ స్క్వేర్‌ వద్ద అమలులోకి తీసుకొచ్చారు. వాహన చోదకులకు అవగాహన కల్పించడానికి ఈ ప్రయోగాన్ని రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ప్రవేశపెట్టినట్లు నగర ట్రాఫిక్‌ డీసీపీ తపస్‌ మహంతి తెలిపారు. ట్రాఫిక్‌ ఇబ్బందులు, ప్రమాదాలను తగ్గించే దృక్పథంతో సరైన డ్రైవింగ్‌ పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు లేన్‌ అవేర్‌నెస్‌ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జంట నగరాల కమిషనరేట్‌ పోలీసు అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ అవగాహన కార్యక్రమం జరుగుతుంది.

3 వరుసల్లో వాహనాల రవాణా

వాహన పరిమాణం మరియు వేగానికి అనుగుణంగా 3 వేర్వేరు వరుసల్లో వాహనాలను క్రమపద్ధతిలో నడిపిస్తారు. ఈ కార్యాచరణ కోసం ఏర్పాటు చేసిన నిర్ధారిత వరుసల్లో ఎలా వాహనాలు నడపాలో ప్రజలకు తెలియజేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. దీనికోసం పోలీసులు ట్రాఫిక్‌ కోన్‌లను ఉపయోగించి రోడ్డుపై 3 లేన్లు ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాటుతో డ్రైవింగ్‌ చేస్తున్నప్పుడు ఒక లేన్‌లో ఉండి మరొక లేన్‌కు మారకుండా చర్యలు తీసుకుంటారు.

ప్రమాదాల నివారణకు కృషి

నగరంలో రద్దీగా ఉండే రోడ్లలో ఎటువంటి సూచనలు లేకుండా వాహనాలు ఒక లేన్‌ నుంచి మరొక లేన్‌కు మారడంతో అత్యధిక ప్రమాదాలకు ప్రధాన కారణంగా విశ్లేషించి ఈ చర్యకు జంట నగరాల కమిషనరేట్‌ పోలీసులు నడుంబిగించారు. ప్రజలు తమ వాహనం కోసం ఏ వరుస ఉద్దేశించబడిందో తెలుసుకుని క్రమపద్ధతిలో వాహనాలు నడపడంపై చైతన్యపరచి ఈ వ్యవస్థని విజయవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు నగర ట్రాఫిక్‌ డీసీపీ తెలిపారు.

అంచెలంచెలుగా విస్తరణ

సాయంత్రం వేళల్లో జయదేవ్‌ విహార్‌ నుంచి డొమొణ స్క్వేర్‌ వరకు ఉన్న రోడ్డులో ట్రాఫిక్‌ రద్దీని నియంత్రించి రవాణా సులభతరం చేసేందుకు లేన్‌ డ్రైవింగ్‌ వ్యవస్థని ప్రయోగాత్మక చర్యగా అమలు చేశారు. ఈ చొరవ విజయవంతమైన ఫలితాలను ఇస్తే రాబోయే రోజుల్లో ఆచార్య విహార్‌, పటియా మరియు డొమొణ వంటి ప్రధాన కూడళ్లలో కూడా ఈ వ్యవస్థను అమలు చేస్తామని పేర్కొన్నారు.

వాహనాల వర్గీకరణ

ఎడమ వరుస: సాధారణంగా సైకిళ్లు, ద్విచక్ర వాహనాలు మరియు ఆటో రిక్షాలు వంటి నెమ్మదిగా కదిలే వాహనాల కోసం ఉద్దేశించబడింది. ఎడమ వైపు మలుపు తిరగడానికి సిద్ధమయ్యే వాహనాలు కూడా దీనిని ఉపయోగిస్తారు.

మధ్య వరుస: మితమైన వేగాన్ని కొనసాగించే కార్లు మరియు ఇతర చిన్నస్థాయి వాహనాలకు ఈ వరస నిర్ధారించారు. ఈ వరస పరిమిత వేగంతో ప్రయాణించడానికి అనువైనది.

కుడి వరుస: సాధారణంగా అధిగమించడానికి (ఓవర్‌ టేకింగ్‌) మరియు వేగంగా దూసుకుపోయే బస్సులు మరియు ట్రక్కులు వంటి భారీ వాహనాల కోసం ప్రత్యేకించబడింది.

ఏఐసీసీ సమావేశాల్లో కొరాపుట్‌ నేతలు



ఈశాన్య రాష్ట్రాల నాయకులతో ఎంపీ సప్తగిరి

కొరాపుట్‌: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో బుధవారం జరిగిన అఖిల భారత కాంగ్రెస్‌ కమిటీ ప్రత్యేక సర్వసభ్య సమావేశాల్లో కొరాపుట్‌ జిల్లా కాంగ్రెస్‌ నేతలు పాల్గొన్నారు. ఒడిశా రాష్ట్ర సీఎల్పీ నాయకుడు, పొట్టంగి ఎమ్మెల్యే రామచంద్ర ఖడం, కొరాపుట్‌ ఎంపీ సప్తగిరి ఉలక, జయపూర్‌ ఎమ్మెల్యే తారాప్రసాద్‌ బాహిణీపతి తదితరులు పాల్గొన్నారు. వీరికి ఇతర నాయకులు స్వాగతం పలికారు.



సభా వేదిక వద్ద ఎమ్మెల్యే తారాప్రసాద్‌ బాహిణీపతి

పుస్తక పఠనంపై అవగాహన



పుస్తకాలతో విద్యార్థులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఒడియా పక్షోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనంపై బుధవారం అవగాహన కల్పించారు. పుస్తకాలను కొనుగోలు చేసి ఇతరులకు బహుమతులుగా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకుడు రంజాన్‌ స్వయి, డీఐపీఆర్వో ప్రమిళ మాఝి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరు అరెస్టు



నిందితుడు భగవాన్‌ హరిజన్‌



నిందితుడు నరేంద్ర హరిజన్‌

జయపురం: స్థానిక గగణాపూర్‌లోని సేవా పేపరు మిల్లు కాంట్రాక్ట్‌ కార్మికుడు పద్మన్‌ హరిజన్‌ హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు జయపురం సదర్‌ పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్‌ బుధవారం వెల్లడించారు. అరెస్టైనవారిలో పంపుణీ గ్రామానికి చెందిన నరేంద్ర హరిజన్‌, భగవాన్‌ హరిజన్‌లు ఉన్నారన్నారు. వీరి వద్ద నుంచి బైక్‌తో పాటు 3 కత్తులు, ఒక గొడ్డలి, ఒక ఇనుప రాడ్డు, ఒక కత్తి సీజ్‌ చేసినట్లు వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. మార్చి 30వ తేదీ సాయంత్రం పద్మన్‌ హరిజన్‌ పేపరు మిల్లు నుంచి తన స్వగ్రామానికి వెళ్తుండగా హత్యకు గురయ్యాడు. అయితే పాత శత్రుత్వం వలనే ఈ హత్య జరిగినట్లు వెల్లడించారు.

ఇదీ విషయం

గ్రామానికి చెందిన పద్మన్‌ హరిజన్‌కు, అలాగే అదే గ్రామంలో ఉంటున్న అన్నదమ్ములు నరేంద్ర, భగవాన్‌లకు మధ్య శత్రుత్వం ఉంది. దీంతో పద్మన్‌ను హత్య చేసేందుకు ఇద్దరు అన్నదమ్ములు ఒక మిత్రుడితో కలిసి ప్లాన్‌ చేశారు. దీనిలో భాగంగా ఆరోజు పద్మన్‌ డ్యూటీ నుంచి బైక్‌పై 5 గంటల సమయంలో ఇంటికి బయల్దేరాడు. అతడిని గగణాపూర్‌ జంక్షన్‌ నుంచి నరేంద్ర అనుసరించాడు. అలాగనే బొనగుడ కొండ వద్ద భగవాన్‌, అతడి మిత్రుడు వేచి ఉన్నారు. పద్మన్‌ను వెంబడిస్తున్న నరేంద్ర ఫోను ద్వారా పద్మన్‌ రాకను భగవాన్‌కు తెలియజేశాడు. కొంత సమయం తర్వాత పద్మన్‌ బైక్‌ అక్కడకు వచ్చిన వెంటనే భగవాన్‌ ఒక గొడ్డలితో దాడి చేశాడు. ఆ దాడిలో పద్మన్‌ ఎడమ కాలుపై తీవ్ర గాయమైంది. అయినా ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగు తీశాడు. అతడి వెనుక భగవాన్‌ గొడ్డలితోను, నరేంద్ర కత్తితోను, వారి మిత్రుడు ఇనుప రాడ్‌తో వెంబడించారు. పద్మన్‌ను వారు వెంటాడి హత్య చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి భగవాన్‌, నరేంద్రలను అరెస్టు చేశామని, మూడో వ్యక్తి పరారీలో ఉన్నాడని పోలీసులు వెల్లడించారు. అతడిని కూడా అరెస్టు చేసి అందరినీ కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

రాష్ట్రంలో శక్తి కారిడార్‌

- డిప్యూటీ సీఎం ప్రభాతి పరిడా

భువనేశ్వర్‌: రాష్ట్రంలో ప్రముఖ శక్తి పీఠాల అనుసంధానంతో శక్తి కారిడార్‌ ఏర్పాటు కానుంది. రానున్న 2 ఏళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా ప్రకటించారు. రాష్ట్రంలో ఆధ్యాత్మిక, తీర్థయాత్ర పర్యటన రంగం బహుముఖ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు దోహదపడుతుంది. శక్తి కారిడార్‌లో భాగంగా రాష్ట్రంలో శక్తి పీఠాలను ఆకాశ వీధుల గుండా హెలికాప్టర్‌లో సందర్శించే సౌలభ్యం అందుబాటులోకి తీసుకు రానున్నట్లు ఆమె తెలిపారు. రాష్ట్ర పర్యాటక రంగానికి పెద్ద ప్రోత్సాహాన్నిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రధాన శక్తి పీఠాలను (దేవత పీఠాలు) అనుసంధానించే 'శక్తి కారిడార్‌' పనులను రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్నట్లు ఆమె ప్రకటించారు. లక్ష్యం మేరకు ఈ ప్రాజెక్ట్‌ 2 ఏళ్లలో పూర్తి చేయడంతో పుణ్య క్షేత్రాలు, సాంస్కృతిక వారసత్వం మరియు మతపరమైన పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించడం విశేషంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రముఖ శక్తి పీఠాలు మా తారాతరిణి, విరజామాత, మా ఉగ్రతార, మా భగవతి, మా మంగళ, మా కాళీజై మరియు మా భైరవి వంటి ఆలయాలను ఒకే ఆధ్యాత్మిక సర్క్యూట్‌లోకి తీసుకొస్తారు.

పిడుగుపాటుకు బర్రె మృతి

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి అంబొదల గ్రామంలో మంగళవారం రాత్రి పిడుగుపడి బర్రె మృతి చెందింది. తన బర్రెను పచ్చిక మేపేందుకు తీసుకెళ్లిన రేనియా ఖంబారు చీకటి పడేసరికి ఇంటికి తొలుకుంటూ వస్తున్న సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. దీంతో పక్కనే ఉన్న ఒక గుడిసె బయట బర్రెను ఉంచాడు. అయితే అ ప్పుడే పిడుగు పడడంతో బర్రె అక్కడిక్కడే మృతి చెందింది. సమాచారాన్ని అధికారులకు తెలియజేశారు.

శ్రీమందిరంలో వనవాస సేవ



వల్లభ మఠంలో పూజలందుకుంటున్న సీతారాముడు, లక్ష్మణుడు

భువనేశ్వర్‌: శ్రీరామ నవమి ఉత్సవాలు పురస్కరించుకుని శ్రీక్షేత్రంలో వనవాస సేవ ఉత్సాహంగా జరుపుకున్నారు. ఏటా పవిత్ర చైత్ర శుక్ల ద్వాదశి నాడు ఈ సేవ నిర్వహిస్తారు. శ్రీరామ నవమి ఉత్సవాలతో పూరీ పట్టణంలో సాహి జాతర ప్రారంభమైంది. ఈ జాతరలో వీధి కళాకారులు కనులకు కట్టినట్లు శ్రీరామ వనవాసం వివరాలతో ప్రదర్శించిన బహిరంగ నాటక ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ సంప్రదాయం ప్రకారం వనవాస సేవ జరిపారు. శ్రీజగన్నాథ వల్లభ మఠం ప్రాంగణంలో ఈ సేవ నిర్వహించారు. ధూపదీప సేవ అనంతరం శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు ఉత్సవమూర్తులను ఛాత్రఛాయలో ఘంటా నాదం మధ్య పల్లకీలో ఊరేగింపుగా శ్రీజగన్నాథ వల్లభ మఠానికి తరలించారు. ఈ ప్రాంగణంలో ప్రత్యేక శయ్యపై ఉత్సవమూర్తులను ఆసీనపరచి వనవాస సేవ ప్రక్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కండేశ్వర్‌ వీధి కళాకారుల బృందం శ్రీరామ వనవాసం వీధి నాటకం ప్రదర్శించారు. ఈ ప్రదర్శన ముగిసిన తర్వాత శీతల భోగ సేవ తదితర ఆచారాలతో ప్రత్యేక పూజాదులు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను శ్రీమందిరం దక్షిణ గృహానికి తరలించి యథాస్థానంలో పదిలపరచడంతో శ్రీరామ వనవాసం సేవ ముగిసింది.

డోలీ మోత.. తీరని వ్యథ

- అస్పత్రికి తరలిస్తుండగా యువతి మృతి



డోలీలో సంజితాను తరలిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పూట్‌ సమితి కాత్రాకుంట గ్రామానికి చెందిన సంజితా గోలారీ అనే యువతి జ్వరంతో బాధపడుతూ డోలీలో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. సంజితా కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. దీనిలో భాగంగా బుధవారం ఆమె పూర్తిగా నీరసించిపోవడంతో ఆస్పత్రికి తీసుకొని వెళ్లాలని నిర్ణయించారు. అయితే గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో అంబులెన్స్‌ కోసం సుమారు ఆరు కిలోమీటర్ల వరకు డోలీలో తీసుకెళ్లాల్సి ఉంది. దీంతో సంజితను డోలీలో కుటుంబ సభ్యులు తీసుకొని బయల్దేరారు. అయితే సకాలంలో ఆస్పత్రికి చేరలేకపోవడంతో ఆమె మార్గమధ్యలోనే మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

'అక్రమంగా గుగ్గిలం చెట్లు తరలింపు'



ఫిర్యాదు చేస్తున్న గదబ తదితరులు

జయపురం: సబ్‌ డివిజన్‌ పరిధి బొరిగుమ్మ సమితి బొడొనాయికగుడ అటవీ ప్రాంతంలో విలువైన గుగ్గిలం చెట్లను కొంతమంది ఇతర రాష్ట్రాలకు అమ్మేందుకు తరలిస్తున్నారని ఆ ప్రాంత అటవీ సురక్ష కమిటీ కార్యదర్శి గోపీనాథ్‌ గదబ ఆరోపించారు. ఈ మేరకు జయపురం అటవీ డివిజన్‌ అధికారి ప్రతాప్‌ బెహరాను బుధవారం కలిసి ఫిర్యాదు చేశారు. కొద్ది రోజుల క్రితం ఆరుగురు వ్యక్తులు 5 విలువైన గుగ్గిలం చెట్లను కొట్టి అమ్మేశారని ఆరోపించారు. ఘటనపై దర్యాప్తు జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఫిర్యాదుదారుల్లో నకుల్‌ గదబ, మనోహర గదబ, లక్ష్మణ గదబ, సోను గదబ తదితరులు పాల్గొన్నారు.

అధికారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు



వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన సర్పంచ్‌లు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి అధికారి ప్రదీప్‌ కుమార్‌ కార్‌ ప్రవర్తనపై సమితిలోని 23 పంచాయతీల సర్పంచ్‌లు, ఇతర నాయకులు కలెక్టర్‌కు ఆశిష్‌ ఈశ్వర్‌ పటేల్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. సదరు అధికారి మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని, అవినీతికి పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. అతని వలన అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన అతడిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించండి



సమావేశాలు ప్రారంభిస్తున్న ఎంపీ ప్రదీప్‌ పాణిగ్రాహి



సమావేశాల్లో పాల్గొన్న ఎంపీ ప్రదీప్‌ పాణిగ్రాహి, ఎమ్మెల్యే రూపేష్‌ పాణిగ్రాహి



మాట్లాడుతున్న ఆర్‌.ఉదయగిరి సమితి చైర్మన్‌ లక్ష్మీనారాయణ సాబొరో

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని మోహనా నియోజకవర్గంలో పాఠశాలల అభివృద్ధి జరగకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆర్‌.ఉదయగిరి సమితి చైర్మన్‌ లక్ష్మీనారాయణ సాబరో అన్నారు. అందువలన పాఠశాలలను అభివృద్ధి చేయాలని కోరారు. గజపతి జిల్లా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ 78వ సాధారణ మ్యానేజ్‌మెంట్‌ కమిటీ సమావేశం, 71వ ప్రాజెక్టుల స్థాయి కమిటీ సమావేశాలు స్థానిక జిల్లా పరిషత్‌ కాన్ఫరెన్స్‌ హాల్‌లో బుధవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బరంపురం ఎంపీ ప్రదీప్‌ కుమార్‌ పాణిగ్రాహి విచ్చేయగా, కలెక్టర్‌ బిజయకుమార్‌ దాస్‌ అధ్యక్షత వహించారు. 2019–20 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ, గిరిజనాభివృద్ధి ప్రత్యేక పథకాలు కింద రూ.1.49 కోట్ల నిధులు ఖర్చు చేయడం జరిగిందని ఐటీడీఏ అధికారి అంశుమాన్‌ మహాపాత్రో తెలియజేశారు. ముఖ్యమంత్రి ఎస్సీ, ఎస్టీ జీవికా మిషన్‌ ద్వారా ఐదు సమితి కేంద్రాలు మోహనా, ఆర్‌.ఉదయగిరి, నువాగడ, గుమ్మా, రాయఘడ సమితుల్లో 79 గ్రామ పంచాయతీ, 311 రెవెన్యూ గ్రామాలు, 143 జనజాతి జీవికా మిషన్స్‌ ఏర్పాటు చేయడం వలన 14,385 మంది గిరిజనులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారని పేర్కొన్నారు. రామగిరి, మహేంద్రగడ, రాయఘడ సమితిల్లో ఎస్సీ, ఎస్టీ రెసిడెన్సియల్‌ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యాలు మెరుగుపరచాలని రాయఘడ సమితి చైర్మన్‌ పూర్ణబాసి నాయక్‌, గుమ్మా సమితి అధ్యక్షురాలు సునేమీ మండళ, మోహనా సమితి చైర్మన్‌ కున్నా మరిఖ తదితరులు కోరారు.

ఏడేళ్ల తర్వాత సమావేశాలు

సమావేశాల అనంతరం ఎంపీ ప్రదీప్‌ కుమార్‌ పాణిగ్రాహి విలేకరులతో మాట్లాడుతూ ఏడేళ్ల తర్వాత ఐటీడీఏ సాధారణ కార్యవర్గ సమావేశాలు జరిగాయన్నారు. గిరిజన ప్రాంతాల్లోని రెసిడెన్షియల్‌ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస వసతులు లేక అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని పీఎం నరేంద్ర మోదీ, సీఎం మోహన్‌చరణ్‌ల దృష్టికి తీసుకెళ్తానని తెలియజేశారు. సమావేశాల్లో నువాగడ సమితి అధ్యక్షురాలు మాలతీ ప్రధాన్‌, జిల్లా పరిషత్‌ సభ్యులు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ



బ్యాటరీ వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలోని డాబుగాం సమితి కార్యాలయంలో దివ్యాంగులకు ఉచిత బ్యాటరీ వీల్‌చైర్లను బుధవారం పంపిణీ చేశారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ, ప్రాథమిక విద్యామంత్రి నిత్యానంద గొండో 60 మంది దివ్యాంగులకు అందజేశారు. అలాగే వినికిడి యంత్రాలు, చార్జింగ్ మెషిన్లు, సెల్‌ఫోన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నబరంగ్‌పూర్ ఎంపీ బలభద్ర మజ్జి, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కుంజదాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

రాయగడ: మజ్జిగౌరి అమ్మవారి చైత్రోత్సవాలను పురస్కరించుకొని స్థానిక మార్వాడీ సమాజం అన్నదాన కార్యక్రమాన్ని మందిరం ప్రాంగణంలో బుధవారం నిర్వహించింది. సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ ఏడాది అమ్మవారి చైత్రోత్సవాల్లో సుమారు 1,500 మందికి అన్నదానం చేశామని, ఇటువంటి తరహా సేవా కార్యక్రమాలను మరిన్ని నిర్వహిస్తామని తెలియజేశారు.

జర్నలిస్టుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌యూజే ప్రతినిధులు

జయపురం: జర్నలిస్టుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని ఎస్‌యూజే కొరాపుట్ జిల్లా ప్రతినిధులు, కొరాపుట్ జిల్లా పాత్రికేయుల సంఘ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు జయపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సీఎం మోహన్‌చరణ్‌ను ఉద్దేశించిన వినతి పత్రం బుధవారం అందజేశారు. ఇటీవల పూరీలో జర్నలిస్టులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో ఎస్‌యూజే జిల్లా అధ్యక్షుడు తరుణ కుమార్ మహాపాత్రో, సహాయ కార్యదర్శి రాజేంద్ర సాహు, సలహాదారు నృసింహ చౌదరి, ఎస్.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రాంగణంలో కలకలం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న ఆంధ్రప్రదేశ్ మహిళా ఆర్థిక సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్.టి.ఆర్ నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రం (స్త్రీ సదన్ మహిళా ప్రాంగణం)లో ఇద్దరు యువతులు అదృశ్యం కావడం కలకలంగా మారింది. బ్యూటీషియన్ శిక్షణ పొందుతున్న 21 ఏళ్ల యువతి, 18 ఏళ్ల యువతి మంగళం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో లంచ్ బ్రేక్‌కు బయటకు వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో స్త్రీసదన్ ఇన్‌చార్జ్ సనపల సత్యవతి ఇన్‌చార్జ్ మహిళా ప్రాంగణం మేనేజర్ పి.విమల సూచన మేరకు ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి పోలీసులు పోలీస్ కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 6309990816, 6309990816 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ ఇద్దరు యువతులదీ విశాఖపట్నం కాగా, ఇద్దరికీ తల్లిదండ్రులు లేరు. ఇద్దరు అనాధులే. ఇందులో ఓ యువతికి దూరపు బంధువులు ఉన్నారు. విశాఖపట్నం స్త్రీసదన్‌లో బ్యూటీషియన్ కోర్సు లేకపోవటంతో వీరు ఎచ్చెర్ల కేంద్రంలో చేరి ఈ నెల ఒకటో తేదీ నుంచి శిక్షణ పొందుతున్నారు. శిక్షణ కాలం రెండు నెలలు. వీరిద్దరు స్నేహితులు. ఇద్దరి వద్దా ఫోన్లు లేదు. తోటి అభ్యర్థుల వద్ద ఫోన్ తీసుకుని హైదరాబాద్, విశాఖపట్నం ప్రాంతాల్లో ఉంటున్న ఇద్దరు వ్యక్తులతో తరచూ మాట్లాడుతున్నట్లు తెలిసింది. ఆ ఫోన్ నంబర్లు ప్రస్తుతం స్విచ్ ఆఫ్ వస్తున్నట్లు సమాచారం. ఇద్దరూ మేజర్లు కావటంతో ప్రేమ వ్యవహారమా? ఇతర కారణాలు ఉన్నాయా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వ్యక్తిగత కారణాలు ఉంటే స్థానిక అధికారుల వద్ద అనుమతి తీసుకొని వెళ్లవచ్చు. అలాకాకుండా సిబ్బంది కళ్లుగప్పి వెళ్లిపోవడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు.

బాలిక ఆత్మహత్య

కవిటి: మండలంలోని కె.కపాసుకుద్దికి చెందిన సిందిరి అపూర్వ(13) అనే బాలిక మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. కవిటి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అపూర్వ కొంతకాలంగా తరచూ అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో మనస్తాపం చెంది మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఇంట్లోనే ఉరి వేసుకుంది. ఈ మరణంపై తమకు ఎటువంటి అనుమానాలు లేవని మృతురాలి తల్లి హేమలత పోలీసులకు తెలియజేసినట్లు ఎస్‌ఐ వి.రవివర్మ తెలిపారు. ఈ మేరకు కవిటి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతదేహానికి బుధవారం ఉదయం సోంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసి అప్పగించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



కొలువదీరిన అమ్మవారి ఘటాలు



పూజల్లో పాల్గొన్న ఆలయ ట్రస్టీ రాయిసింగి బిడిక, సభ్యులు సన్యాసిరాజు దంపతులు



శివలింగం ముగ్గు వేస్తున్న పురోహితుడు

కొలువుదీరిన ఘటాలు

- ప్రారంభమైన నగర పరిక్రమణ
- కొనసాగుతున్న చైత్రోత్సవాలు

రాయగడ: పట్టణంలో మజ్జిగౌరి అమ్మవారి చైత్రోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి ప్రతిరూపాలుగా కొలిచే ఘటాలు కొలువుదీరాయి. ఆలయ ప్రాంగణంలో ఘటాలను ఏర్పాటు చేశారు. పసుపు, కుంకుమలను అద్దిన ఘటాలను ప్రత్యేకంగా పూజించారు. సాయంత్రం నుంచి ఘటాల నగర పరిక్రమణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో దుష్టశక్తులు ప్రవేశించకుండా వాటి బారి నుంచి ప్రజలను కాపాడాలన్న ఉద్దేశంతో అమ్మవారు ప్రతిరోజూ రాత్రి నగర పరిక్రమణ చేస్తారని ప్రతీతి. చరిత్రకు అనుగుణంగా సాంప్రదాయ పద్ధతిలో అమ్మవారి ప్రతిరూపాలైన ఘటాలను ఈ చైత్రోత్సవాల ఐదు రోజులూ ఊరేగిస్తారు. దీనినే నగర పరిక్రమణ అంటారు. ఘటాలు ఊరేగించే సమయంలో పూజారి ఘటాల ముందు పసుపు కలిపిన బియ్యాన్ని గ్రామస్తులకు బొట్టుగా అందిస్తారు. ఈ బొట్టును ధరిస్తే దుష్టశక్తులు ఏవీ దరి చేరవని నమ్మకం. అదేవిధంగా చిన్న పిల్లలకు ఈ పసుపును నీటిలో కలిపి తాగిస్తారు. దీంతో ఏటువంటి రోగాలు దరి చేరవని నమ్మకం.

చండీ హోమం

పట్టణ ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని, పంటలు సమృద్ధిగా పండాలని ప్రతీ ఏడాది చైత్రోత్సవాల ప్రధాన పూజల్లో భాగంగా చండీహోమం నిర్వహిస్తారు. గంజాం జిల్లా కవిసూర్యనగర్‌కు చెందిన ప్రత్యేక పురోహితుల ఆధ్వర్యంలో చండీ హోమం పూజలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. చివరి రోజున ఈ చండీహోమం ముగిస్తారు. దీనినే పూర్ణాహుతి అంటారు.

ప్రత్యేక అలంకరణ

సునాబేసోలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారి గర్భగుడితో పాటు ఆలయ ప్రాంగణాన్ని కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అలంకరించారు. ప్రతిరోజూ ప్రసాద సేవన కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నాయి. వివిధ సేవా సంస్థలకు చెందిన మహిళలు ప్రసాదాలను వితరణ చేస్తున్నారు.



పూలతో అలంకరించిన మందిర ప్రాంగణం

శ్రీక్షేత్రానికి దవనం మొక్కలు



దవనం మొక్కలను చూపిస్తున్న దేవాలయ కమిటీ సభ్యులు



ఎగుమతికి సిద్ధమవుతున్న మొక్కలు

కొరాపుట్: పూరీ క్షేత్రంలో జగన్నాథుడికి ఎంతో ప్రీతిపాత్రమైన దవనం మొక్కలను స్థానిక శబరి శ్రీక్షేత్రం నుంచి పూరీ ఆలయానికి బుధవారం పంపించారు. ఈ మొక్కలతో చేసిన దండలు ప్రతిరోజూ పూరిలో దేవ దేవుళ్లకి వేస్తారు. ఇవి సాధారణ వాతావరణంలో పెరగవు. అందువలన వీటిని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి పూరి క్షేత్రానికి దిగుమతి చేస్తారు. అయితే కొందరు వ్యవసాయ శాస్త్రవేత్తలు వీటిని కొరాపుట్‌లో పెంచారు. అవి విస్తారంగా పెరగడంతో పూరీ క్షేత్రం నుంచి పండితులు వచ్చి పరిశీలించారు. వారు ఆమెదం తెలపడంతో పాటు తీసుకుని వెళ్లడానికి ప్రత్యేక వాహనం పంపించారు. దీంతో ఈ మెక్కలను తరలించారు. ఇకపై వీటిని విస్తారంగా పెంచాలని శబరి శ్రీక్షేత్ర కమిటీ నిర్ణయించింది.

కార్యాలయానికి తాళాలు వేసిన కౌన్సిలర్లు



ఆందోళన చేస్తున్న కౌన్సిలర్లు

కొరాపుట్: నబరంగ్‌పూర్ మున్సిపల్ కార్యాలయానికి వైస్ చైర్మన్ సౌమ్య మహాపాత్రో, కౌన్సిలర్లు బుధవారం తాళాలు వేశారు. మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ బిశ్వప్రియ దాస్ ఏకచత్రాధిపత్యం చేస్తున్నారని, ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని, గెలిపొందిన ప్రజాప్రతినిధులను చులకనగా చూస్తున్నారని ఆరోపించారు. గతంలో అతనిపై పార్టీలకు అతీతంగా కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రోకి ఫిర్యాదు చేయడంతో వారం రోజుల్లో బదిలీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ నెల రోజులు పూర్తయ్యినప్పటికీ బదిలీ జరగకపోవడంతో ఈవిధంగా నిరసన తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఇది తెలిసి మున్సిపల్ చైర్మన్ కును నాయక్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. పరిస్థితిని జిల్లా కలెక్టర్‌కి ఫోన్‌లో వివరించారు. వారం రోజుల్లో ఇంజినీర్‌ని బదిలి చేస్తామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఎ.సతీష్ (బీజేపీ), మురళి(ఇండిపెండెంట్), రంజితా పండా(బీజేడీ), రామో నాయక్ (బీజేడీ) తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చైత్ర పర్వోత్సవాలు



అమ్మవారి ఘటాల పూజల్లో ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి తదితరులు

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో చైత్ర పర్వోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కొన్నిచోట్ల గ్రామ దేవతల ఉత్సవాలు ముగియగా, మరి కొన్నిచోట్ల కీలక దశకు చేరుకున్నాయి. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని బుడి ఠాకురాణి అమ్మవారి ఉత్సవ కమిటీ రాజ పురోహితుడు నర్సింగ త్రిపాఠిని సన్మానించింది. తెంతులకుంటి సమితిలో ఘటాల ర్యాలీలో నబరంగ్‌పూర్ ఎమ్మె ల్యే గౌరీ శంకర్ మజ్జి పాల్గొన్నారు. ఎమ్మె ల్యే రఘురాం మచ్చో, జెడ్పీ చైర్‌పర్సన్ సస్మితా మెలకాలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువత

మల్కన్‌గిరి: జిల్లాలో ఒడియా పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్ మాట్లాడుతూ.. రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చన్నారు. రక్తదానం చేసిన యువతను అభినందించారు. శిబిరంలో మొత్తం 100 యునిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేద్బార్ ప్రధాన్, సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి, జిల్లా వైద్యాధికారి బ్రోజ బందు దాస్, జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్ చంద్ర శబరో పాల్గొన్నారు.

ఎస్‌ఐ పేరిట రూ.60 వేలకు టోకరా

- నిజమేనని నమ్మి మోసపోయిన యువకుడు

మందస: మందసకు చెందిన శ్రీనివాస్ పాడి అనే యువకుడు సైబర్ మోసానికి గురయ్యాడు. శ్రీనివాస్‌కు మంగళవారం రాత్రి ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి ఎస్‌ఐకు అర్జెంట్‌గా రూ.60 వేలు నగదు అవసరమైందని చెప్పాడు. ఫోన్ పే చేస్తే ఆ డబ్బును కానిస్టేబుల్‌తో తిరిగి పంపించేస్తానని తెలిపాడు. మాట తీరు బట్టి నిజమేనని నమ్మిన శ్రీనివాస్ 7569341175 అనే నంబర్‌కు ఫోన్ పే చేశాడు. కానిస్టేబుల్ ఎంతసేపటికీ రాకపోయేసరికి కొద్ది సమయం తర్వాత ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. ఇది సైబర్ నేరగాళ్ల పనిగా గుర్తించిన పోలీసులు విచారణ చేపడతామని చెప్పారు.

వస్త్ర వ్యాపారి అనుమానాస్పద మృతి



బావిలో తేలుతున్న మృతదేహం

పొందూరు: మండల కేంద్రం పొందూరుకు చెందిన వస్త్ర వ్యాపారి ఉంగ్రాళ్ల కిషోర్‌కుమార్(50) అనుమానాస్పదంగా మృతిచెందారు. బుధవారం ధర్మపురం గ్రామ సమీపంలోని బావిలో మృతదేహం తేలడంతో గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటకు తీయగా పొందూరుకు చెందిన వస్త్ర వ్యాపారి కిషోర్‌గా గుర్తించారు. వెంటనే భార్య అనూషకు సమాచారం అందించారు. మంగళవారం రాత్రి ధర్మపురంలో బాకీలు వసూలు చేసేందుకు వెళ్లాడని, బావిలో పొరపాటున కాలుజారి పడిపోయి ఉంటారని అనూష ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వి.సత్యనారాయణ చెప్పారు. మృతదేహాన్ని బయటకు తీసి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కిషోర్‌కుమార్‌కు భార్య అనూష, కుమారుడు శ్రీనిత్, కుమార్తె శ్రీయ ఉన్నారు. కాగా, పొందూరులో దశాబ్దాలుగా కిషోర్ కుటుంబీకులు వస్త్రవ్యాపారం చేస్తున్నారు. వ్యాపారంలో ఒడిదుడుకులు రావడం, కస్టమర్లకు ఎక్కువగా అరువులు ఇవ్వడం, దీనికి తోడు బ్యాంకు రుణం ఉండటంతో కొన్నాళ్లుగా ఆందోళన చెందుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పొందూరులో సుపరిచితుడైన కిషోర్ మృతితో విషాద ఛాయలు అలముకున్నాయి.

పురుగు మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య



వృద్ధుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్‌ఐ వైకుంఠరావు

మెళియాపుట్టి : మండలంలోని జర్రిభద్ర గ్రామానికి చెందిన దుంపల సూర్యారావు(80) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సూర్యారావుకు ఐదుగురు కుమారులు. చాలా సంవత్సరాల క్రితమే భార్య చనిపోవడంతో నెలకొక కుమారుడి ఇంటి వద్ద ఉంటున్నాడు. ప్రస్తుతం కుమారుడు నాగేశ్వరరావు వద్ద ఉండేవాడు. ఏం జరిగిందో గానీ మంగళవారం మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం గ్రామానికి కొంతదూరంలో ఉన్న పంటపొలాల్లో వాంతులు చేసుకుంటూ పడిపోయాడు. స్థానికులు గమనించి సమాచారం అందించగా మరో కుమారుడు అప్పారావు 108 అంబులెన్సులో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించాడు. అక్కడ చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. పురుగుల మందును నీటిలో కలిపి తాగినట్లు పోలీసులు గుర్తించారు. కుమారుడు నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై రమేష్ బాబు తెలిపారు.

బ్యాంకు ఉద్యోగి దుర్మరణం



హరినాథ్‌కుమార్ నాయుడు(ఫైల్)

నరసన్నపేట: నెల్లూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసన్నపేట నాయుడువీధికి చెందిన హరినాథ్ కుమార్‌నాయుడు (బాబీ)(46) మృతి చెందారు. ఈయన నెల్లూరు జిల్లా ముత్తుకూరు యాక్సిస్ బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్నారు. తిరుపతిలో నివాసం ఉంటున్నారు. మంగళవారం ద్విచక్ర వాహనంపై వెళ్తూ ముత్తుకూరు మండలం కొప్పల దొరువు సమీపంలో కుక్క అడ్డంగా రావడంతో అదుపుతప్పి పడిపోయారు. ఈ ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బుధవారం వేకువజామున చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో నాయుడువీధిలో విషాదం అలముకుంది. మంచి మిత్రుడిని కోల్పోయామని గొద్దు చిట్టిబాబు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.

టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో హైడ్రామా

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఉదయం హైడ్రామా నడిచింది. ఫిర్యాదు ఇచ్చేందుకు వెళ్లిన ఓ వ్యాపారిపై పోలీసులు చెంపదెబ్బ కొట్టారని అతని భార్య ఆడియో వైరల్ కాగా.. అదే సమయంలో అతను ధ్యానముద్రలోకి వెళ్లిపోయినట్లు పోలీసులు చెప్పడం గమనార్హం. ఓ వైపు హోంమంత్రి అనిత అదే సమయంలో జిల్లాకు రానుండటం, ఈ విషయం ఎక్కడ సంచలనంగా మారుతుందోనని పోలీసులు కలవరపాటుకు గురయ్యారు. సీఐ ఈశ్వరరావు, ఫిర్యాదుదారులు చెప్పిన వివరాలిలా ఉన్నాయి.. సకలాభక్తుల హరిహరకుమార్, మల్లా సంతోష్‌కుమార్‌లు టీటీడీ కల్యాణ మండపం సమీపంలో వలలు తయారు చేసే దుకాణాలు నడుపుతున్నారు. ఇద్దరూ బంధువులు కావడం, లావాదేవీల్లో తేడాలు రావడం, హరిహరకుమార్ కుమారుడు సచిన్.. సంతోష్‌కుమార్‌తో గొడవపడటంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు బుధవారం ఉదయం 9:45 గంటలకు వెళ్లి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు.

స్టేషన్‌లో ఏమైందంటే..

సంతోష్‌కుమార్ భార్య సంధ్య మీడియాకు వాట్సాప్ ద్వారా ఆడియో రికార్డు రిలీజ్ చేశారు. తన భర్త ఫిర్యాదివ్వడానికి వెళ్తే పోలీసులు చెంపదెబ్బ కొట్టారని, కాసేపయ్యాక స్పృహ కోల్పోయారని పేర్కొన్నారు. ఈ విషయమై స్టేషన్ ఎస్‌ఐ-2 రామారావు వద్ద ప్రస్తావించగా.. తాను సంతోష్ కుమార్‌ను చెంపదెబ్బ కొట్టలేదని కొద్దిగా దూరం వెళ్లి కూర్చోమని తోయగా అక్కడే ధ్యానం చేస్తూ కూర్చుండిపోయాడని చెప్పారు. స్పృహ కోల్పోలేదని స్పష్టం చేశారు. స్టేషన్‌కు వచ్చిన సమయంలో సంతోష్‌కుమార్ అడ్డంగా పడుకుని ఉన్నాడని, అతని భార్యకు చెబితే ఆమెపైనే చేయి చేసుకున్నాడని పేర్కొన్నారు. ఇదే విషయమై స్టేషన్ ఎస్‌హెచ్‌వో, సీఐ ఈశ్వరరావు వద్ద ప్రస్తావించగా సంతోష్‌కుమార్ అనే వ్యక్తి హరిహరరావు వద్ద రూ. 30 లక్షలు ఛీటింగ్ చేశాడని, ఇందుకు సంబంధించిన పత్రాలు వారి వద్ద ఉన్నాయని, స్టేషన్‌లో ఎవరూ అతన్ని కొట్టలేదని, థర్డ్‌పార్టీ స్టేట్‌మెంట్ కూడా తీసుకున్నామని, అతను హరహరరావుపై పెట్టిన కేసు గుర్తింపదగనిదిగా గుర్తించి కేసు నమోదు చేయలేదన్నారు. సంతోష్‌కుమార్‌పై మాత్రం ఛీటింగ్ కేసు నమోదైందన్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- గ్రామాల్లో ఆటలమ్మ, గవదబిళ్లల కేసులు
- వేసవి నేపథ్యంలో పెరుగుతున్న తీవ్రత
- పిల్లల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

పాతపట్నం:

వేసవి వచ్చిందంటే చాలు కొందరికి అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయి. ముఖ్యంగా చిన్నారుల్లో చికెన్‌పాక్స్ ఎక్కువగా కనిపిస్తుంటుంది. గవదబిళ్లలు, ఆటలమ్మగా పిలిచే ఈ సమస్య బారిన పడిన వారికి జలుబు, జ్వరం, శరీరంపై పొక్కులు, దవడలకు ఇరువైపులా వాపు, నొప్పి వంటివి తీవ్రంగా బాధిస్తాయి. అన్ని వయసుల వారికి ఈ అంటువ్యాధులు సోకే అవకాశమున్నా, ప్రధానంగా చిన్నారుల్లో ఎక్కువగా వస్తుంటుందని వైద్యులు చెబుతున్నారు. అందుకే ముందు జాగ్రత్త, అప్రమత్తతతో వ్యవహరిస్తే దీని బారిన పడకుండా రక్షణ పొందవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. పదేళ్లలోపు చిన్నారుల విషయంలో మరింత శ్రద్ధ చూపాలని చెబుతున్నారు.

వ్యాధి నిరోధక శక్తి తక్కువుంటే..

సాధారణంగా వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్న వారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంటుంది. అందుకే చిన్నారులు బలవర్ధకమైన ఆహారం తీసుకునేలా తల్లిదండ్రులు చొరవచూపాలి. ఆటలమ్మ, గవదబిళ్లలు సోకిన వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతారు. ఆకలి లేకపోవడం, ఆహారం సరిగా తీసుకోలేకపోవడం వంటి చర్యలు వల్ల తీవ్రంగా నీరసించిపోతారు. శరీరంపై నీటి పొక్కులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించగానే ఆటలమ్మగా గుర్తించి వైద్యులను సంప్రదించాలి. వ్యాధి తీవ్రత ఆధారంగా వైద్యుల సూచన మేరకు యాంటీవైరస్, యాంటీ బయోటిక్ మందులు వాడాల్సి ఉంటుందిల్లీ



ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- ఆటలమ్మ సోకిన వారిని మిగతా వారికి దూరంగా ఉంచాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు ఇవ్వడం మంచిది.
- గవదబిళ్లలు వచ్చిన వారికి గొంతునొప్పి తీవ్రంగా ఉంటుంది. తరచూ ద్రవపదార్థాలను ఆహారంగా తీసుకోవాలి.
- ఆటలమ్మ, గవదబిళ్లలు వచ్చిన వారి విషయంలో ప్రజలు అపోహలు, మూఢ నమ్మకాలతో వైద్య సహాయం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారు. అది మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే మెదడు, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఇలాంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు పిల్లలకు గోరువెచ్చని నీరు, శుభ్రమైన ఆహారం ఇవ్వడంతో పాటు పరిసరాల్ని పరిశుభ్రంగా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

నిర్లక్ష్యం తగదు..



ఆటలమ్మ, గవదబిళ్లల వ్యాధులపై నిర్లక్ష్యం తగదు. చిన్నారులు ఎక్కువగా ఈ సమస్యతో బాధపడుతుంటారు. వ్యాధి లక్షణాలు కనిపించగానే వెంటనే వైద్యులను సంప్రదించి వారి సూచనలు మేరకు మందులు వాడాలి.

– డాక్టర్ ఎస్.కృష్ణారావు, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, పాతపట్నం

క్లుప్తంగా

పశు సంవర్ధకశాఖ అధికారుల సంఘం అధ్యక్షుడిగా కృష్ణ



పశు సంవర్ధకశాఖ అధికారుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

విజయనగరం ఫోర్ట్: పశు సంవర్ధకశాఖ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ రెడ్డి కృష్ణ ఎన్నికయ్యారు. ఈ మేరకు స్థానిక పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో బుధవారం పశు సంవర్ధకశాఖ అధికారుల సంఘం నూతన కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సీహెచ్.దీనకుమార్, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ టి.ధర్మారావు, కోశాధికారిగా డాక్టర్ కేవీరమణ, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ ఆర్. శారద ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు అధికారిగా రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు బాలకృష్ణ వ్యవహరించారు.

డీసీహెచ్ఎస్‌గా డాక్టర్ పద్మశ్రీ రాణి



డీసీహెచ్ఎస్ పద్మశ్రీ రాణికి అభినందనలు తెలియజేస్తున్న కార్యాలయం సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయధికారి(డీసీహెచ్ఎస్)గా డాక్టర్ ఎస్.పి.పద్మశ్రీ రాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జ్ డీసీహెచ్ఎస్‌గా పనిచేస్తున్న ఆమె ఉద్యోగోన్నతిపై రెగ్యులర్ డీసీహెచ్ఎస్‌గా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీసీహెచ్ఎస్ పరిధిలో ఉన్న ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం డీసీహెచ్ఎస్ పరిధిలో ఖాళీ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేస్తామన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు డీసీహెచ్ఎస్ కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

నెల్లిమర్ల: రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొనే అండర్-19 విభాగం జిల్లా జట్టును నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటలో బుధవారం ఎంపిక చేశారు. పురుషుల విభాగంలో నాగ వెంకట్(48-50), రోహిత్(50-55), ఎర్రి నాయుడు(55-60), ప్రవీణ్(60-65), కిరణ్(70-75), సూర్య తేజ(80-85), బాలకుమార్(85-90), లోకేష్(90+)లు ఎంపికయ్యారు. వీరు త్వరలో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఎంపిక పోటీలను జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మద్దిల అప్పలనాయుడు, జనరల్ సెక్రటరీ లక్ష్మణరావు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కాళ్ల మహేష్ తదితరులు నిర్వహించారు.


వడదెబ్బతో వ్యక్తి మృతి



సింహాచలం మృతదేహం

బొబ్బిలి: ఎండ వేడిమికి తాళలేక తెర్లాం మండలం కె.సీతారాంపురానికి చెందిన కోస్టు సింహాచలం(58) బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో బుధవారం మృతిచెందాడు. యాత కులస్తుడైన సింహాచలం వెదురుతో తయారయ్యే బుట్టలు, కోళ్ల గూళ్ల ను పటిష్టంగా ఉంచే నల్లుకట్టే పని చేస్తుంటాడు. ఈ పనిమీదనే రాయగడ వెళ్లి పనిముగించుకుని తిరిగి స్వగ్రామం వచ్చే సమయంలో బొబ్బిలి రైల్వేస్టేషన్‌లో దిగి ఎండ వేడిమికి సేదతీరుతూ అస్వస్థతకు గురై మృతి చెందినట్లు భావిస్తున్నారు.రెండో ప్లాట్‌ఫాంపై మృతి చెందిన వ్యక్తి సంఘటనలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే హెచ్‌సీ బి ఈశ్వరరావు తెలిపారు.

ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న విశ్రాంత ఐఏఎస్ మురళి

బొండపల్లి: ప్రతిరోజూ క్రమం తప్పకుండా ధ్యానం చేయడం ద్వారానే ఆరోగ్యంగా ఉండడానికి అవకాశం ఉంటుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి జె.మురళి పేర్కొన్నారు. ఈ మేరకు బొండపల్లి మండలకేంద్రంలో మూడు రోజుల పాటు శ్రీరామచంద్ర మిషన్, హార్ట్‌వెల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా ,ధ్యానం శిక్షణ తరగతుల్లో భాగంగా చివరిరోజు బుధవారం ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఐఏఎస్ అధికారి మురళి మాట్లాడుతూ నేడు ప్రతి ఒక్కరూ కూడా తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతూ అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. అనారోగ్యం నుంచి బయట పడాలంటే మనస్సును ప్రశాంతంగా ఉంచుకుని ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ధ్యానం చేయడం ద్వారా మానసిక ఒత్తిడి నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు జీఎస్ఎన్.రాజు, జె.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నియోజకవర్గానికి విజన్ ప్లాన్

- ఉమ్మడి జిల్లా కలెక్టర్లు డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్, శ్యామ్‌ప్రసాద్



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా కలెక్టర్లు డాక్టర్ అంబేడ్కర్, శ్యామ్‌ప్రసాద్

విజయనగరం అర్బన్: భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా ప్రతి నియోజకవర్గానికి విజన్ ప్లాన్ రూపొందించాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ కోరారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. స్వర్ణాంధ్ర-2047 కెపాసిటీ బిల్డింగ్‌పై విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల అధికారులకు రెండు రోజుల వర్క్‌షాప్ బుధవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ప్రారంభమైంది. ఈ వర్క్‌షాప్‌కు హాజరైన కలెక్టర్లు అంబేడ్కర్, శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాకు సంబంధించిన డ్రాఫ్ ప్లాన్‌ను రూపొందించామని అలాగే నియోజకవర్గాలకు కూడా ప్రణాళికను రూపొందించాలని చెప్పారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని నియోజకవర్గ ఎంఎల్‌ఏల సలహాలను కూడా పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా జిల్లాల భౌగోళిక పరిస్థితిని బట్టి వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ప్రగతికి ఎక్కువగా అవకాశం ఉంటుందన్నారు. విజయనగరం జిల్లాలో సుమారు 6,500 పైగా ఎంఎస్ఎంఈలు ఉన్నాయని వాటిని అభివృద్ధి చేయడం ద్వారా పారిశ్రామికంగా కూడా అభివృద్ధికి అవకాశం ఉంటుందని కలెక్టర్ అంబేడ్కర్ చెప్పారు. భోగాపురం విమానాశ్రయం పూర్తయితే పారిశ్రామిక, సేవా రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ఎంతో అవకాశం ఉందని, విజన్ 2047 డాక్యుమెంట్ భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.



పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

ఉద్యాన పంటల సాగును విస్తరించాలి

మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాలకు ఒకే ప్రణాళిక పనిచేయదని, అక్కడి క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ప్రాథమిక రంగంలో ఉద్యాన పంటల సాగును విస్తరించడం, పశుసంపదను వృద్ధి చేయడం తదితర చర్యలపై సూచించారు. పండ్లు, కూరగాయల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. వర్క్‌షాప్‌ను విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ బుధవారం ఉదయం ప్రారంభించారు. ముఖ్య ఆర్థిక సూచికల ద్వారా, డేటాను సమీకరించడం, దానిని విశ్లేషించడం, ప్రణాళికలను రూపొందించడంపై శిక్షణ ఇచ్చారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రణాళిక శాఖ విశ్రాంతి డైరెక్టర్, సలహాదారులు సీతాపతిరావు, మూడు జిల్లాల సీపీఓలు పి.బాలాజీ, వీర్రాజు, లక్ష్మీ ప్రసన్న, నియోజగకవర్గాల ప్రత్యేకాధికారులు, పర్యవేక్షణ బృందం సభ్యులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సురేష్



బ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన సురేష్

దత్తిరాజేరు: బ్రాహ్మణ పురోహిత సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గడసాం గ్రామానికి చెందిన ఇనుగంటి సురేష్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ పురోహిత సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సతీష్‌శర్మ నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. గజపతినగరం నియోజకవర్గంలోని బ్రాహ్మణుల అభ్యుదయానికి పాటు పడతానని, గజపతినగరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న బ్రాహ్మణుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయనున్నట్లు చెప్పారు.

ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం అధికార ప్రతినిధిగా త్రిశూల్‌కుమార్



వెంపటి శంకర నారాయణకుమార్ (త్రిశూల్ కుమార్)

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ఉత్తరాంధ్ర జోన్ అధికార ప్రతినిధిగా విజయనగరం పట్టణానికి చెందిన త్రిశూల్ విద్యాసంస్థల అధినేత వెంపటి శంకర నారాయణ (త్రిశూల్ కుమార్)ను నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్‌కేమనోహర్‌రావుల నుంచి ఎంపిక ఆదేశాలు తనకు వచ్చినట్లు త్రిశూల్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అంధ విద్యార్థులకు ఉచిత వసతి, విద్యాబోధన

- బొబ్బిలి ఏషియన్ ఎయిడ్ స్కూల్ టీచర్స్



ఎస్సై కె.లక్ష్మణరావుకు కరపత్రం అందజేస్తున్న బొబ్బిలి ఏషియన్ ఎయిడ్ స్కూల్ టీచర్స్

గజపతినగరం: ఒకటవ తరగతి నుంచి 10వతరగతి వరకు విద్యాభ్యాసంతో పాటు భోజన, వసతి సౌకర్యాన్ని అంధ విద్యార్థులకు ఉచితంగా కల్పించనున్నామని ఆసక్తి గల విద్యార్థులు చేరాలని బొబ్బిలి ఏషియన్ ఎయిడ్ స్కూల్ టీచర్స్ సుధాకర్ బుష్మి, బి.త్రినాథం, పి.రాజులు తెలిపారు. ఈ మేరకు బుధవారం గజపతినగరం ఎస్సై కె.లక్ష్మణరావుకు కరపత్రాలను అందజేసి విలేకరులతో మాట్లాడారు. గజపతినగరం, పురిటిపెంట, ఎం.వెంకటాపురం గ్రామాల్లో వారు పర్యటించి దృష్టి లోపం గల విద్యార్థులకు ప్రభుత్వ అనుసంధానంతో కూడిన బొబ్బిలి ఏషియన్ ఎయిడ్ స్కూల్ అన్నిరకాల సదుపాయాలను అందిస్తుందని ఆసక్తిగల వారు ముందుకు వచ్చి ఇక్కడ చదువుకుని ఉన్నతమైన స్థానాలకు చేరాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎంఈఓ కార్యాలయం, భవిత సెంటర్ సిబ్బందిని కలిసి కరపత్రాలను అందజేశారు.

ఆటోను ఢీ కొట్టిన ట్రాక్టర్: మహిళ మృతి

- మరో నలుగురిరు మహిళలకు గాయాలు



ఆదిలక్ష్మి మృతదేహం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

రామభద్రపురం: మండలంలోని గొల్లలపేట గ్రామం వద్ద బుధవారం ఆటోను ట్రాక్టర్ ఢీ కొట్టగా జరిగిన ప్రమాదంలో ఆటోలో ఉన్న ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో అదే ఆటోలో ఉన్న మరో నలుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గర్భిణితో ఉన్న ఓ మహిళను చూసేందుకు గొల్లలపేట గ్రామం నుంచి కొట్టక్కి గ్రామానికి ఆటోలో ఐదుగురు మహిళలు బయల్దేరి వెళ్తున్నారు. సరిగ్గా ఆ గ్రామం దాటాక సచివాలయం సమీపంలోని శ్మశానం సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఓ ట్రాక్టర్ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న బాలి లక్ష్మి(37) అక్కడికక్కడే మృతిచెందగా బాలి పద్మావతి, బాలి రమణమ్మ, లెంక సత్యవతి, బాలి వాసవిలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే ఎస్సై వి.ప్రసాదరావు సంఘటనస్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి, తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు, మృతురాలి భర్త రామకృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్సై వి.ప్రసాదరావు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రామకృష్ణ వ్యవసాయకూలీ కాగా వారికి ఇద్దరు కుమార్తెలు లలిత, హేమ ఉన్నారు.

వల్లంపూడి ఎస్ఐను సస్పెండ్ చేయాలి



వల్లంపూడి పోలీసుస్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న దళితసంఘాల నేతలు, మహిళలు

- పోలీస్ స్టేషన్ ముందు దళితుల ధర్నా
- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

వేపాడ: వల్లంపూడి ఎస్ఐ బి.దేవిని తక్షణమే సస్పెండ్ చేయాలని, గుడివాడలో జరిగిన సంఘటనలో తప్పుడు కేసులను రద్దు చేయాలని కోరుతూ దళితులు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద బుధవారం ఆందోళన చేశారు. ఏపీ దళిత కూలీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి గాలి ఈశ్వరరావు, దళిత నాయకుడు కిరణ్ ఆధ్వర్యంలో ముందుగా అక్కడి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్ఐ తీరుపై నిరసన తెలిపారు. అనంతరం స్టేషన్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం, యాతపేట, వల్లంపూడి మీదుగా ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. తహసీల్దార్ జె.రాములమ్మకు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

దళితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తిచేశారు. ఈ సందర్భంగా బాధితులు గుడివాడ మోహన్, గాలి ఈశ్వర్రావు మాట్లాడుతూ గుడివాడలో మార్చి 11న రాత్రి జరిగిన ఘటనలో నమోదు చేసిన తప్పుడు కేసులను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ వీరాకుమార్, ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు, ఎల్.కోట ఎస్ఐ నవీన్‌పడాల్ బందోబస్తు నిర్వహించారు.

40 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్



స్వాధీనం చేస్తున్న సారాను చూపిస్తున్న కురుపాం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ప్రభుత్వ ఆదేశాలతో నిర్వహిస్తున్న నవోదయం 2.0 దాడుల్లో భాగంగా బుధవారం జియ్యమ్మవలస మండలం శిఖబడి గ్రామంలో 40 లీటర్ల సారాతో డి.సుందరం అనే వ్యక్తి పట్టుబడినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఆ వ్యక్తి వద్ద లభించిన సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. అలాగే సారా సరఫరా చేసే బొమ్మాళి అరుణ్ అనే వ్యక్తిని కూడా అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

వీరఘట్టంలో 60 లీటర్ల సారా..

వీరఘట్టం: మండలంలోని పాల్లరోడ్డులో బుధవారం సాయంత్రం వాహన తనిఖీలు చేస్తుండగా బైక్‌పై వస్తూ బైక్ వదిలేసి ఓ వ్యక్తి పరారవడంతో సోదా చేసి బైక్‌పై ట్యూబ్‌లో 60 లీటర్ల సారా ఉన్నట్లు గుర్తించామని ఎస్సై జి.కళాధర్ తెలిపారు. సారాను స్వాధీనం చేసుకుని బైక్ సీజ్ చేశామని ఎస్సై చెప్పారు. బైక్‌పై సారా తరలిస్తున్న వ్యక్తి స్థానిక కొండవీధికి చెందిన దుర్గారావుగా గుర్తించి కేసు నమోదు చేశామన్నారు.

ఢిల్లీలో దొరికాడు

శ్రీకాకుళం క్రైమ్: విదేశాల్లో చదువుకోవాలనుకున్న విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసి యూనివర్సిటీలో ఫీజులు కట్టకుండా ఎగ్గొట్టిన వ్యక్తిని ఎట్టకేలకు రెండో పట్టణ పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ అంశంపై ఏడుగురు బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు గత ఏడాది జులై 29న ఎస్పీ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. కజికిస్తాన్ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ సీట్లు ఇప్పిస్తానని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన కొందరు విద్యార్థుల నుంచి తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌కు చెందిన హరీష్ గంగాధర్ ఒప్పందం ప్రకారం ఒక్కొక్కరి వద్ద రూ. 25 లక్షల నుంచి రూ. 45 లక్షల లోపు వసూలు చేశాడు. కజకిస్తాన్‌లో కళాశాల, వసతిగృహానికి సంబంధించి ఒక సంవత్సర ఫీజును మాత్రమే చెల్లించి మిగతా సొమ్ము సుమారు రూ. 2 కోట్లు కాజేశాడని సీఐ తెలిపారు. ఎప్పటి నుంచో తప్పించుకుని విదేశాల్లో తిరుగుతున్న హరీష్ గంగాధర్‌ను పట్టుకునేందుకు లుకౌట్ నోటీస్ పంపామని, ఎట్టకేలకు ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఇమ్మిగ్రేషన్ అధికారులు పట్టుకుని తమకు సమాచారం అందించారన్నారు. దీంతో ఢిల్లీ తమ పోలీసులను పంపి హరీష్ గంగాధర్‌ను అదుపులోకి తీసుకున్నామని బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు అరెస్టు చేసి రిమాండ్ కోసం కోర్టుకు తరలించామని సీఐ ఈశ్వరరావు వెల్లడించారు.

అక్రమ విద్యుత్ కనెక్షన్లపై విజిలెన్స్ దాడులు



పొలాల్లో అక్రమ విద్యుత్ కనెక్షన్లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు చిట్టితల్లి, రమణ

మెరకముడిదాం: మండలంలోని పలుగ్రామాల్లో వినియోగిస్తున్న అక్రమ విద్యుత్ కనెక్షన్లపై విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా బుదరాయవలస, సోమలింగాపురం, ఇప్పలవలస గ్రామాల్లో వ్యవసాయ పంపసెట్లకు అక్రమ విద్యుత్ కనెక్షన్లపై దాడులు నిర్వహించి, ఆయా విద్యుత్ కనెక్షన్లు వాడుతున్న రైతులకు అపరాధ రుసుం విధించారు. అలాగే పలు విద్యుత్ కనెక్షన్లను అధికారులు పరిశీలించారు.

రోగనిరోధకశక్తి పెంపుదలతో వ్యాధులు దూరం

- త్వరలో దేశంలో ఇమ్యునో థెరపీ డ్రగ్స్
- వరల్డ్ అలెర్జీ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్

నెల్లిమర్ల/నెల్లిమర్ల రూరల్: ఇమ్యునో థెరపీ డ్రగ్స్‌తో శరీరం ఏ వ్యాధికి గురైనా దానిని అదుపు చేయడానికి అవకాశం ఉంటుందని వరల్డ్ అలెర్జీ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వ్యాకరణం నాగేశ్వర్ అన్నారు. ఈ మేరకు బుధవారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఇంటిగ్రేటెడ్ మెడికల్ స్కిల్స్ అనే వర్క్‌షాపును వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగేశ్వర్ మాట్లాడుతూ రానున్న కాలంలో వివిధ రకాల వ్యాధులకు మాత్రలు, ఇంజక్షన్లకు బదులుగా ఇమ్యూనో థెరపీ డ్రగ్స్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇతర దేశాల్లో ఆ విధానం ఇప్పటికే కొనసాగుతోందని తెలిపారు. ఇదిలా ఉండగా అనేక వ్యాధులను నియంత్రించాలంటే ఇమ్యూనో థెరపీ డ్రగ్స్ చికిత్స కీలక పాత్ర పోషించనుందని చెప్పారు. వ్యాధుల నియంత్రణ యాంటిజన్, యాంటిబాడీ ప్రతి చర్యలపై ఆధారపడి ఉంటుందన్నారు. అందువల్లనే కోవిడ్ సమయంలో యాంటిబాడీ కణాలు ఎక్కువగా చనిపోవడం వల్ల రోగనిరోధకశక్తి తగ్గి ఎక్కువ మంది మత్యువాతపడ్డారని పేర్కొన్నారు. అప్పటి నుంచి ఇమ్యునాలజీకి ప్రాధాన్యం పెరిగిందని వివరించారు. అంతేకాకుండా మన దేశంలో వివిధ రకాల అలెర్జీలతో బాధపడుతున్న వారి సంఖ్య 35 శాతం ఉందని, వాటికి చికిత్సనందించే వైద్యులు మాత్రం దేశ వ్యాప్తంగా కేవలం 800 మంది మాత్రమే ఉన్నారన్నారు. త్వరలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం, వరల్డ్ అలెర్జీ ఫౌండేషన్ సంయుక్తంగా మెడికల్ స్పెషలిస్ట్ అసిస్టెంట్ ప్రోగ్రాం అనే కొత్త కోర్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. అందులో ఉద్యోగావకాశాలు అత్యధికంగా ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ శాంతమ్మ, రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి, కన్వీనర్ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ ఆచార్యులు, డాక్టర్ చైతన్య, ఫోరెన్సిక్, అనస్థీషియా విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ శాఖలో నలుగురికి కారుణ్య నియామకాలు

- ఆర్డర్స్ ఇచ్చిన ఎస్పీ వకుల్



కారుణ్య నియామక పత్రాలను ఇస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: పోలీస్‌శాఖలో కారుణ్య నియామకాలు మొదలయ్యాయి.ఈ మేరకు శాఖలో కారుణ్య నియామకాలకు సంబంధించి శాఖలో మృతిచెందిన నలుగురి కుటుంబసభ్యులకు గురువారం ఎస్పీ వకుల్ జిందల్ నియామక పత్రాలను అందజేశారు. పోలీస్‌శాఖలో ఆర్మ్‌డ్, లా అండ్ ఆర్డర్‌లో వివిధ కారణాలతో ఇటీవల కొందరు మృతి చెందడంతో ఆయా కుటుంబాలలో కారుణ్య నియామకాలను భర్తీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ విధి నిర్వహణలో మృతిచెందిన పోలీసు కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఆయా కుటుంబాలలో అర్హత ఉన్న వ్యక్తులకు ఉద్యోగ నియామక పత్రాలను ఇచ్చామని తెలిపారు. ఈ సందర్భంగా తరుణ్‌కుమార్, కోమలత, స్వామినాథ్, సాయిరెడ్డిలకు ఎస్పీ వకుల్ జిందల్ కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలను ఇచ్చారు. ఏఆర్ విభాగంలో పనిచేసిన ఏఆర్ హెచ్‌సీలు వెంకటరావు, అప్పలనాయుడు, సివిల్‌లో పనిచేసిన ఏఎస్సై కుమారస్వామి, హెచ్‌సీ చంద్రశేఖర్ ఇటీవలే అనారోగ్యాలతో మరణించారని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, డీపీఓ ఏఓ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ వరలక్ష్మి, జూనియర్ సహాయకురాలు చాముండేశ్వరి పాల్గొన్నారు.

వీరఘట్టంలో ఆవులు, మేకల దొంగలు



ఆవులు, మేకల దొంగలపై ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులు

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన స్థానికులు

వీరఘట్టం: గడిచిన రెండేళ్లుగా వీరఘట్టం మేజర్ పంచాయతీలోని గొల్లవీధి, తెలగవీధి, పెరుగువీధి, మేకలవీధితో పాటు పలు వీధుల్లో ఆవులు, మేకలు, దూడలను ఆగంతుకులు ఎత్తుకుపోతున్నారనే విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం రాత్రి కొంతమంది వ్యక్తులు తెలగవీధిలోని ఓ ఇంటి ముందు ఉన్న రెండు ఆవులను ఎత్తుకెళ్లే ప్రయత్నం చేస్తుండగా స్థానికులు అడ్డుకోవడంతో ఆగంతుకులు తప్పించుకుని పారిపోయారని తెలగవీధికి చెందిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. తెలగవీధిలో మూగజీవాలను ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారనే విషయం తెలియడంతో చాలా వీధుల నుంచి బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. రెండేళ్లుగా మా పశువులను కూడా గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని పోలీసులకు తెలియజేశారు. గురువారం పూర్తి స్థాయిలో అందరం కలిసి ఫిర్యాదు చేసేందుకు బాధితులంతా ఏకతాటిపైకి వచ్చారు. ఆవులు, మేకలను దొంగిలిస్తున్న వారిపై కఠినంగా చర్యలు చేపట్టాలని పోలీసులను కోరారు.

ఆయుర్వేద వైద్యశాలలో మందుల కొరత



వైద్యం కోసం వచ్చిన రోగులు

- ప్రైవేట్ దుకాణాల్లో కొనుగోలు చేస్తున్న రోగులు

విజయనగరం ఫోర్ట్: ☛ గంట్యాడ మండలానికి చెందిన వి. నారంనాయుడు మోకాళ్ల నొప్పులతో విజయనగరంలో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు కొద్ది రోజుల క్రితం వెళ్లాడు. అక్కడ మందులు లేక పోవడంతో ప్రైవేట్ ఆయుర్వేద ముందుల దుకాణంలో కొనుగోలు చేశాడు.

☛ విజయనగరం మండలానికి చెందిన పి.లక్ష్మి చర్మ సంబంధిత వ్యాధితో విజయనగరంలో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు వెళ్లగా అక్కడి వైద్యుడు రాసిన మందులు లేకపోవడంతో ప్రైవేట్ ఆయుర్వేద మందుల దుకాణంలో మందులు కొనుగోలు చేసింది.

వీరిద్దరే కాదు. అనేక మంది రోగులకు ఎదురువుతున్న పరిస్థితి ఇదే. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నామని. ప్రజారోగ్యానికి కోట్లాది రుపాయలు ఖర్చు చేస్తున్నామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. కానీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. అల్లోపతి వైద్యం తర్వాత ఆయుర్వేద వైద్యానికి అంత ప్రాధాన్యం ఉంది. అయితే ప్రస్తుతం ఆయుర్వేద వైద్యశాలలో మందులు లేక పోవడంతో వైద్యం కోసం వచ్చిన వారు నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితి.



ప్రభుత్వ ఆయుర్వేదవైద్యశాల

సాధారణ వ్యాధులకు కూడా లేని మందులు

ఆయుర్వేద వైద్యశాలలో సోరియాసిస్, మధుమేహం, కీళ్లనొప్పులు, గైనిక్ సమస్యలు, జీర్ణ కోశ వ్యాధులు, మూత్ర వ్యాధులు, న్యూరాలజికల్ సమస్యలు, గుండెజబ్బులు, రుమటైడ్ ఆర్థరైటిస్, శ్వాస కోశసమస్యలకు సంబంధించిన మందులు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ప్రస్తుతం లేవు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వైద్యుడికి చూపించిన తర్వాత మందుల గది వద్దకు వెళ్లిన రోగులకు అక్కడ మందులు లేక పోవడంతో ప్రైవేట్ మందుల దుకాణాల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. కొంత కాలంగా ఇదే పరిస్థితి ఉంది.

ఇండెంట్ పెట్టాం

చాలావరకు మందులు అయిపోయాయి. మందులు పంపించాలని ఇండెంట్ పెట్టాం. ఇంకా రాలేదు. – ఎం.ఆనంద్‌రావు, వైద్యాధికారి, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల



ఆయుర్వేద మందులు